పాఱిపోయివచ్చెను. నీలా శవమిదే వచ్చుచున్నది. చూడు' మని పలికెను. ఇంతలో నీలా శవము లోనికి గొనిరాబడెను. తల్లి శవముమీద పడి హోరున యేడ్చెను. ఇంతలో సైనికులు బేహూ యెటుపోయెనో తెలుపుమని తొందర జేసిరి. అప్పుడు నీలాతల్లి బేహూని సైనికుల కప్పగించినను తనకుమారుడు తిరిగి రాడని గ్రహించెను. వెంటనే సైనికులకు నాలుగయిదు దినములనుండి బేహూ తనయింటికి వచ్చుటలేదని తెలిపెను. హత్యచేయబడిన దామెకుమారుడే యగుటచే యామె యసత్యము పలుకదని సైనికులు విశ్వసించి బేహూని వెదకుటకై వెడలిపోయిరి.

నీలాతల్లి లోనికి పోయి బేహూని బయటకు తీసుకొనివచ్చి యేడ్చుచూ 'బేహూ! నీ కిది ధర్మమా? నాకుమారునే చంపితివే! వాడు నీ కేమి హాని చేసెను? తమ్ముడను తమ్ముడని యింటిచుట్టును తిరిగి యిటుల గొంతుక కోయుట ధర్మమా?' యని పలికెను. బేహూ 'ఓ ముసలమ్మా! వీరదేవుడు మాకుటుంబమునకు చేసినయక్రమమునకు ప్రతిక్రియ నే చేసితిని. రామరాజునకు మాతండ్రి సాయముచేయుచున్నాడను నెపముమీద నాతండ్రిని చంపించెను. అప్పటినుండియు నాహృదయమునకు శాంతి లేదు. ఏనాడా వీరదేవుని గర్భజాలవిషకీటకమును త్రుంచిపారవేయుదునో యానాడు నాకు నిద్రాహారములు. ఆకార్యము నెఱవేర్చుకొనుటకే యిన్నిదినములు నీగృహముచుట్టును తిరుగుచుంటిని. నేటికి నా కార్యము సాఫల్యమయినది. ఇక నాహృదయము శాంతించును. ఆవీరదేవుని భర్తగా పడసినందులకు నీ వీబాధ ననుభవింపుము. నీకిది తప్పదని పలుకుచు బయటికి పాఱిపోయెను.

రేణుకావరప్రసాదరావు.

# శోభనం ముచ్చట.

సుందర్రావును నేనును బాల్యస్నేహితులము. వాడు సుందరం శోభనమగుటచే మేముందరము బయలుదేరాము. సుందర్రావత్తవారి దొకచిన్న పల్లెటూరు. అక్కడిమనుష్యు లతివిచిత్రంగా వుంటారు. నాగరికతంటే యేమిటో వారికి తెలియదు. ఇది యందరకు తెలిసినవిషయమే. దాని కేమిలెండు. ఆనాటిరాత్రి 8 గంటలకు సుందర్రావును భార్యను గదిలోనికి పంపేరు. పీటలమీద కూర్చుండినప్పుడేనా సుందరం భార్యమొగము మాకు కనబడలేదు. ఎందుచేతనంటే ఆపిల్ల పల్లెటూరితనం పోగొట్టుకోకుండా తల భూమిలోనికి వంచివేసింది.

రాత్రి యేమిజరిగినదో మనకు తెలియదు గాని తెల్లవారుజాము 3 గంటలకే వచ్చేశాడు మావాడు నాదగ్గరకు. తరువాత మేమిరువురము కొంతసేపు మాట్లాడుకొని తెల్లవారగనే కాలువ గట్టునకు బోతిమి. తిరిగి మేమింటికి వచ్చేసరికి ఇల్లంతా గందరగోళంగా వుంది. లోపలికి వెళ్ళగానే షష్టిపూర్తియైన ముసలమ్మ యొకర్తె యెదురుగా వచ్చి 'ఏమి నాయనా అప్పుడే భార్యవస్తువులు జాగ్రత్తచేశావా? అంది. "అన్నా! ఏమీ యెరుగనట్లుండి మొత్తపనిచేశావూ, ఎంత దొంగవి?" అని యెగతాళిచేయడం మొదలెట్టారు కొందరమ్మలక్కలు. సుందరంనిలువున

పోయాడు. వాడు ఖంగారు పడడం చూచి అసలు జరిగినసంగతేమిటని వారినడిగేరు. ఏమీలేదు సుందరం భార్యనగలుతీసి దాచుకొన్నాడన్నారు. సుందరం నగలుతీస్తే నాతో చెప్పకుండా వుంటాడా! తాను రాత్రి భార్యతో మాటైనా మాట్లాడలేదని చెప్పాడు. ఆపిల్ల భయంతో వణుకుతూనే వుందన్నాడు. మొగముమీదనుంచి చేతులైనా తీయలేదట. పైగా తెల్లవారుజామున వీధిలోనికివచ్చి తిరిగివెళ్ళేసరికి తలుపు మూసికొన్నదని చెప్పాడు. అని సందేహము తోచి బాగుగా ఆలోచించి నగలు రాత్రి తీసినాడా? తెల్లవారుజామున తీసినాడా? అని అడిగేరు. తెల్లవారుజామున వీధిలోనికి వెళ్ళి వచ్చినతరువాత తీసినాడట' అన్నారు. సరే సంగతి బోధపడిందన్నాను. ఇంతలో రాత్రి క్రొత్తగా వచ్చిన చుట్ట మేమయినాడని ఒక రడిగేరు. అంతా కలవరపడ్డారు. ఆయన శోభనపుగదిప్రక్కనే వున్న బల్లమీద పండుకొన్నాడు. ఎప్పుడు వెళ్ళాడో చెప్పకుండానే పోయినాడన్నాడు సుందరం మామగారు. దాంతో జరిగిందంతా వ్యక్తపడింది. క్రొత్తచుట్టమును మొగపెళ్లివారితరఫువాడని ఆడపెళ్లివారును ఆడపెళ్లివారితరఫని మొగపెళ్లివారు వూహించినారేకాని వానిసంగతి యెవరును యెరుగరు. శోభనపుగది ప్రక్కనేవున్న బల్లమీద పండుకొని సుందరం వీధిలోనికి వెళ్ళగానే తాను లోన ప్రవేశించి ఆబాలిక యథాప్రకారంగా తనభర్తయేయని భావించి, మానముద్ర వహించి, కండ్లు గట్టిగా మూసికొని వుండడం చేత మెల్లగా పండుకొనినట్లే పండుకొని వస్తువులు జాగ్రత్తగా తీసికొని తెల్లవారకుండా నడిచాడు. వస్తువులు తీయునప్పుడైనా ఆపిల్ల తన భర్తయే వేళాకోళమునకు తీయుచున్నాడని కండ్లయినను తెరువక యూరకొన్నదట. అందరూ ఆపిల్లమూఢత్వాన్ని నిందించడం మొదలెట్టారు. ఏమిలాభము. లోకమందింకను యిట్టిముగ్ధరాండ్రున్నందుననేకదా యిట్టియుపద్రవములు వాటిల్లుచున్నవి.

కోట నరసింహమూర్తి.

# దయయుంచి అంతా నవ్వండి.

### నిరంకుశాధికారి.

టీచరు:—నిరంకుశాధికారం టే ఎవరో చెప్పు?

పిల్లడు:—పెళ్లి కానివాడండీ!

### మూలగడం.

డాక్టరు:—మీకిప్పుడు నిమ్మళంగా ఉన్నదా?

సుందరం:—నాకేమి?

డాక్టరు:—ఇంతకుముందు మీరు చాలాసేపు మూలిగారే.

సుందరం:—నేను సంగీతపాటకుడనండీ.

### కేసులు.

(ఇంగ్లీషుమాష్టరు గ్రామరు చెప్తూ)

మాష్టరు:—కేసు లెన్నిరా?

పిల్లవాడు:—సోపుకేసు, క్రిమినల్ కేసు, సూట్కేసునండీ.

### వరస.

వెంకయ్య:—ఏమండీ! మీకు ఆయన ఏమవుతాడండీ.

ఒకడు:—దోవలో ఎదురౌతాడండీ!

—భద్రం.